# దేహభ్రాంతిని వీడి దైవచింతన చేయండి

**పాపభయంబు పోయె పరిపాటయిపోయెను దుష్కృతంబిలన్**
**శ్రీపతి భక్తిపోయె వివరింపగలేని దురంత కృత్యముల్**
**దాపురమయ్యె లోకమున తాపసలోకశరణ్యుడైన ఆ**
**శ్రీపతి నామచింతనయె చేకురచేయు సుఖంబు మానవా!**

ప్రేమస్వరూపులారా! నిత్యజీవితంలో జనన మరణాలను అనుభవింపజేసే ఈ ప్రకృతియే నిజమైన ప్రాణదేవత. ఈ ప్రపంచము ప్రతి మానవుణ్ణి మోహింప జేయుచున్నది. దీనియందు ప్రధానమైనటువంటిది పదార్థము. పదార్థముల యొక్క చేరికయే ఈ ప్రపంచము. ఏతావాతా మానవుణ్ణి మోహింపజేయునవి పదార్థములే. ఇవి అశాశ్వతమైనవి, అసత్యమైనవి. 'యద్దృశ్యం తన్నశ్యం.' కంటికి కనిపించునదంతయు నశించునటువంటిదే! ఇలాంటి అస్థిరమైన పదార్థములు జీవితమునకు సత్యమైన శాంతిని, శాశ్వతమైన ఆనందమును ఏవిధంగా చేకూర్చ గలవు?

పరబ్రహ్మతత్త్వము రూపరహితమైనది. "అహం ఏతత్ న", ఇదియే ప్రపంచమునకు మూలాధారమైనటువంటి జ్ఞానసూత్రము. 'అహం' అనే పదానికి వేదము 'ఆత్మ' అనే అర్థము చెప్పింది. "అహం ఏతత్ న" అనగా ఏమిటి? "ఇది నేను కాదు." ఈ అస్థిరమైన, అసత్యమైన దేహము 'నేను' కాదు. ఈ ప్రపంచములో మనం ఎన్నో పదార్థములను చూస్తున్నాము. ఇవి సత్యమని, నిత్యమని భ్రమిస్తున్నాము. ఇది చాలా పొరపాటు. మన కంటికి కనిపించే దృశ్యములన్నీ ఏదో ఒకనాటికి అదృశ్యమైపోతాయి. ఏ కన్నులు ఈ అస్థిరమైన ప్రపంచమును చూస్తున్నాయో అవే కన్నులు మన దేహమునుకూడా చూస్తున్నాయి. కాబట్టి, దృశ్యకల్పితమైన ఈ దేహముకూడా అశాశ్వతమే! ఇట్టి

sri sathyasaivachanamrutam

అశాశ్వతమైన దేహమును శాశ్వతమని భావించడం పొరపాటే కదా! అనాది కాలమునుండి మానవుడు అనిత్యమైన, అసత్యమైన పదార్థములను నిత్య సత్యమైనవిగా భ్రమించి వాటిపట్ల తాను ఆకర్షితుడౌతున్నాడు. ఇట్టి అశాశ్వతమైన పదార్థములలో ఉన్న శాశ్వతమైన తత్త్వమును గుర్తించడానికి ప్రయత్నించాలి.

**'దైవం మానుష రూపేణ'**

భగవద్గీతలో కృష్ణుడు చెప్పాడు: "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః" "ప్రతి ప్రాణీ, ప్రతి మానవుడూ నా అంశమే" అన్నాడు. కాబట్టి, మానవుడు అనిత్యమైనవాడని, అశాశ్వతమైనవాడని భావించడం సరియైనది కాదు. మన ప్రాచీనులు భగవంతుడు సర్వత్రా ఉన్నాడనే విశ్వాసముతో భగవచ్చింతన చేస్తూ, ఆరాధన సల్పుతూ వచ్చారు. భగవంతుడు ముక్కోటి దేవతాస్వరూపుడని విశ్వసించారు. ముక్కోటి దేవతలంటే ఎవరు? అంతమంది దేవతలున్నారా? దీని అంతరార్థమేమిటి? ఆనాడు ప్రపంచంలో మూడుకోట్ల జనులుండేవారు. ప్రతి వ్యక్తీ భగవత్స్వరూపుడేనన్న భావముతో ఆవిధంగా చెప్పారు. దానికి పూర్వం "సహస్ర శీర్షా పురుషః..." (భగవంతుడు వేలాది శిరస్సులు కల్గినవాడు) అన్నారు. అప్పుడు ప్రపంచ జనాభా వేలసంఖ్యలో ఉండేది. ఈనాడు సుమారు 600 కోట్లకు పెరిగిపోయింది. వీరంతా ఎవరు? భగవత్స్వరూపులే! అన్ని శిరస్సులూ భగవంతునివే! ఆకారములో మీరు మానవులు కావచ్చునుగాని, మీలో ప్రతి ఒక్కరూ భగవంతుని అవతారమే! కనుక, దైవము ఎక్కడో ప్రత్యేకంగా ఉన్నాడని భావించకండి. ప్రతి వ్యక్తీ, ప్రతి జీవీ దైవ స్వరూపమేనని విశ్వసించండి. సర్వజీవులయందు ఒకే ఆత్మ ప్రతిబింబిస్తున్నది.

భగవంతుడెక్కడున్నాడు? అని అడిగితే కొందరు 'నా హృదయంలో ఉన్నాడు,' అని చెబుతారు. ఇది సరియైన జవాబు కాదు. 'ఈ కర్చీఫ్ నా చేతిలో ఉన్నది,' అన్నప్పుడు నా చేయి ఈ కర్చీఫ్‌కంటే పెద్దదనే కదా అర్థం. అదేవిధంగా, నీ హృదయంలో ఉన్న భగవంతుడు నీకంటే చిన్నవాడై ఉండాలిగాని, పెద్దవానిగా ఉండడానికి వీల్లేదు కదా! కాబట్టి, భగవంతుడు నీలో ఉన్నాడని చెప్పుకోవడం పొరపాటు. నీవే భగవంతుడవు. సర్వమూ నీలోనే ఉన్నది. అందరూ భగవంతునిలోనే ఉన్నారు. "సర్వతః పాణి పాదం..."

sri sathyasaivachanamrutam

ఈ ప్రపంచమంతయు మానవుని హృదయమునందే చిత్రింపబడియున్నది. కనుకనే, 'దైవం మానుష రూపేణ' అన్నారు. భగవంతుడు మానవాకారము పొందియున్నాడు. మీరు మానవత్వములో ఉన్న దైవత్వమును విస్మరించి, మానవాతీతమైన దైవత్వము కోసం ప్రాకులాడుతున్నారు. అందువల్లనే సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నారు.

**అనేకత్వంలోని ఏకత్వమే ఆత్మతత్త్వం**

దైవత్వం గుణాతీతమైనది; రూపరహితమైనది; దేశకాలపరిస్థితుల ప్రభావమునకు అతీతమైనది. అలాంటి దైవత్వమునకు మీరొక ఆకారమును కల్పించి, ఆరాధన సల్పుతున్నారు. సర్వత్రా కనిపించేవన్నీ దైవస్వరూపములే! సర్వోపనిషత్తులూ అనేకత్వంలోని ఏకత్వాన్ని నిరూపిస్తున్నాయి. కాని, మానవుడు ప్రాకృతమైన భావములచేత ఏకత్వాన్ని అనేకత్వంగా విభజిస్తున్నాడు. అనేకత్వములోని ఏకత్వాన్ని గుర్తించడానికి ప్రయత్నించడం లేదు. మూలాధార తత్త్వము ఒక్కటే. అదే ఏకత్వము. అదే ఆత్మతత్త్వము. ఏకత్వము – ఆధారము, అనేకత్వము – ఆధేయము. ఇక్కడ మనకెన్నో బల్బులు కనిపిస్తున్నాయి. ప్రతి బల్బునందు ప్రకాశము గోచరిస్తున్నది. బల్బులు ఎన్నైనా కరెంటు ఒక్కటే కదా! అదేరీతిగా, అనేకత్వంలో ఏకత్వం ప్రకాశిస్తోంది. మనమొక గృహమును నిర్మించుకొని వెలుతురుకోసం అనేక బల్బులు పెట్టుకున్నాము. మెయిన్ స్విచ్‌ను 'ఆన్' చేస్తే అన్ని బల్బులూ వెలుగుతాయి; 'ఆఫ్' చేస్తే అన్నీ ఆరిపోతాయి. దేహాలన్నీ వేర్వేరు బల్బులవంటివి. ఆత్మయే వాటిలో ప్రసరించే 'కరెంటు'. ఆత్మతత్త్వము సర్వభూతములందు ప్రసరిస్తున్నది. ఆత్మ అనగా చైతన్యశక్తియే! అదియే బ్రహ్మానందశక్తి. అదియే నిత్యానందశక్తి. అదియే యోగానందశక్తి. అదియే అద్వైతానందశక్తి. అట్టి అద్వైతతత్త్వమును గుర్తించడానికి ప్రయత్నించక మానవుడు అనేకత్వమును పెంచుకొని అజ్ఞానాంధకారమును అనుభవిస్తున్నాడు. ప్రపంచంయొక్క ప్రభావమునకు లోబడి తన స్వభావమును మరచిపోతున్నాడు.

**సత్యమే భగవత్స్వరూపము**

స్వభావమనగా ఆత్మభావము. దానినే మనం అనుసరిస్తూ రావాలి. అది పెరగదు,

sri sathyasai vahiniamrutam

తరగదు. ఎప్పటికీ సత్యమై నిత్యమై ఉంటుంటాది. అట్టి ఆత్మతత్త్వాన్ని గుర్తించడానికి మీరు ప్రయత్నించాలి. సర్వత్రా ఉన్నది ఆత్మతత్త్వమే! దానిని విభజించడానికి ఎలా వీలౌతుంది! కనుక, విభజించడానికి ప్రయత్నించకండి. అంతా ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించడం చాలా సులభం. 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి.' ఆ సత్యమే భగవత్స్వరూపము.

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
సత్యంబునందణగె సర్వసృష్టి
సత్యమహిమలేని స్థలమేది కనుగొన్న?
శుద్ధసత్త్వమిదియె చూడరయ్య!

ప్రపంచమంతయు సత్యమునుండియే పుట్టింది. సత్యమునందే కనిపిస్తున్నది. కడపటికి సత్యమునందే లీనమైపోతుంది. ప్రపంచమంతయు సత్యముపైనే ఆధారపడియున్నది. అట్టి సత్యముకోసం మీరు ఎక్కడో వెదకనక్కర్లేదు, ఎక్కడ చూసినా కనిపిస్తూనే ఉన్నది. కాని, మీరు చూడడానికి ప్రయత్నించడం లేదు. ప్రయత్నించి చూస్తే, ఎక్కడ చూసినా సత్యమే కనిపిస్తుంది. వేదము 'సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ నబ్రూయాత్ సత్యమప్రియం...' అని బోధిస్తున్నది. సత్యమునే పలకాలి. అది ప్రియముగా, మృదుమధురముగా ఉండాలిగాని, కఠినమైనదిగా, బాధించేదిగా ఉండకూడదు. కఠినమైన సత్యము సత్యము కాదు. లోకంలో భగవంతుడు ఎక్కడ చూసినా ఉన్నాడంటారు. నిజమే, ఎక్కడ చూసినా ఉన్నాడు. కాని, మృదుమధురమైన సత్యములో తాను దేదీప్యమానంగా ప్రకాశిస్తుంటాడు.

**కామ, క్రోధములే మానవునికి పరమ శత్రువులు**

ప్రేమస్వరూపులారా! అందరియందున్న ఆత్మతత్త్వము ఒక్కటే అని గుర్తించండి. భేదములను త్రుంచుకోండి. ప్రేమప్రకాశమును అనుభవించండి. ఈనాటి మానవుడు పాపభీతిని కోల్పోవడంచేత ఎన్నో విధములైన పెడమార్గాలు పడుతున్నాడు.

పాపభీతి లేని పామరత్వము బట్టి
దైవప్రీతి లేని దానిబట్టి

srisathyasaivachanamrutam

మానవత్వమణగె మానవులందున
విశ్వశాంతి కిదియె విప్లవంబు

మానవునియందు దివ్యత్వము మరుగునపడడానికి కారణం ఇదియే! మానవుని వలె పశుపక్షిమృగాదులుకూడా ఆనందమును ఆశిస్తున్నాయి, అనుభవిస్తున్నాయి. కాని, మానవుడు అనుభవించే ఆనందమునకు, పశుపక్షిమృగాదులు అనుభవించే ఆనందమునకు వ్యత్యాసమున్నది. పశుపక్షి మృగాదులు సుఖానికి పొంగిపోవు, దుఃఖానికి క్రుంగిపోవు. సుఖదుఃఖాలపట్ల అవి సమత్వం వహిస్తాయి. కాని, మానవునియందు ఈవిధమైన సమత్వం లేదు. కామ, క్రోధాది దుర్గుణములను అరికట్టుకోలేక మానవుడు పతనం చెందుతున్నాడు. కామము చీడపురుగు, క్రోధము వేరుపురుగు. ఈ రెండూ చేరి మానవ జీవితవృక్షాన్ని శిథిలం చేస్తున్నాయి. కామ, క్రోధములే మానవునికి పరమ శత్రువులు. మానవుణ్ణి పట్టిపీడించే మహాదుర్మార్గమైన గ్రహాలు ఈ రెండే! మితిమీరిన కోరికలు చాలా ప్రమాదాన్ని సృష్టిస్తున్నాయి. కోరికలు ఉండవలసిందే! కాని, వాటికొక పరిమితి ఉండాలి. 'నశ్రేయో నియమం వినా' అన్నారు. ఈనాటి మానవునికి ఒక క్షణంలో క్రోధం వస్తుంది, మరొక క్షణంలో ప్రేమ పుడుతుంది. ఈవిధంగా అప్పటికప్పుడు పుట్టి పోయే ప్రేమ ప్రేమకాదు. ఇవి ఆహారవిహారములవలన కలిగే వికారములే! మీకు ఏ సంకల్పము కలిగినప్పటికీ తక్షణమే దానిని ఆచరణలో పెట్టకూడదు. కొంత సమయం తీసుకొని, 'ఇది మంచిదా? చెడ్డదా?' అని విచారణ చేయాలి.

**'బ్రహ్మ మీకిచ్చి పంపును బరువు మాల...'**

ఈనాడు క్రొత్త సంవత్సరము ప్రారంభమైనదని మీరు ఆనందంగా పండుగ జరుపుకుంటున్నారు. కాని, ఈ ఆనందము ఒక్క దినముకూడా పూర్తిగా ఉండదు. మనం అనుభవించవలసిన ఆనందము ఇది కాదు. కదలిపోయే మేఘమువలె అప్పటికప్పుడు వచ్చిపోయేది ఆనందము కానేరదు. మనం అనుభవించే ఆనందము శాశ్వతంగా ఉండాలి.

sri sathyasai vahamrutam

## తేదీ 02.04.2003, ఉగాది, సాయిరమేశ్ సభామండపం, బృందావనం

**జనని గర్భమునుండి జన్మించినప్పుడు**
**కంఠమాల లవేవి కానరావు**
**మంచిముత్యపు సరుల్ మచ్చునకును లేవు**
**మేల్మి బంగరుదండ మెడకు లేదు**
**రత్నాల హారముల్ రంజిల్లగా లేవు**
**పచ్చలు కెంపులు పొదగ లేదు**
**వజ్రాల హారముల్ వర్ధిల్లగా లేవు**
**గోమేధికంబులు తోడ లేవు**
**కలదు కలదొక్క మాల మీ కంఠమందు**
**ఎన్ని చేసిన అవియన్ని ఎంచి ఎంచి**
**మంచియైనను చెడుగైన త్రుంచకుండ**
**బ్రహ్మ మీకిచ్చి పంపును బరువు మాల**
**కర్మలన్నియు చేర్చిన కంఠమాల**

మీరు జన్మజన్మలనుండి చేసిన పాపపుణ్యములతో కూర్చబడిన కంఠమాలను ధరించి వస్తున్నారు. మీరు చేసే ప్రతి కర్మకుకూడను ప్రతిఫలము ఉంటుండాది. 'రియాక్షన్' లేని 'యాక్షన్' లేదు. ఏ చిన్న కర్మ చేసినా దానికి ప్రతిఫలము ఉండే తీరుతుంది. ఉదాహరణకు, నీవొక సూదితో ఒక బట్టను కుడుతున్నావనుకో. సూది చిన్నదే కావచ్చు. కాని, పొరపాటున అది చేతికి గ్రుచ్చుకుంటే తక్షణమే రక్తము వస్తుంది. అనగా, కర్మకు ఆ క్షణంలోనే ఫలితం వస్తున్నది. నీవు భుజించిన ఆహారము జీర్ణం కావడానికి కనీసం రెండు గంటల టైమ్ పడుతుంది. భూమిలో నాటిన విత్తనం మొలకెత్తడానికి కనీసం ఒక వారం పడుతుంది. ఇదేవిధంగా, కొన్ని కర్మలు కొన్ని నెలల తరువాత లేదా కొన్ని సంవత్సరముల తరువాత లేదా కొన్ని జన్మల తరువాత ఫలితాన్ని అందిస్తాయి. ప్రతి వ్యక్తీ తాను చేసిన కర్మకు ప్రతిఫలం అనుభవించే తీరాలి. అయితే, 'మేము అనుభవించే బాధలనుండి తప్పించుకోవడానికి వీలుకాదా,' అని మీరు చింతించనక్కర్లేదు. తప్పించుకోవచ్చు! మీ హృదయస్థాయినుండి పవిత్రమైన ప్రేమ బయలుదేరినప్పుడు ఆ బాధలన్నీ

srisathyasaivachanamrutam

మరుగునపడిపోతాయి. కర్మఫలితము మన ఆలోచనపైన ఆధారపడి ఉంటుంది. మన ఆలోచన ఎట్టిదో ఫలితమట్టిది. కర్మ ఎట్టిదో కాయమట్టిది. కార్యమెట్టిదో ఫలితమట్టిది. కాబట్టి, మనం కాయమును సరియైనరీతిలో బలపరచుకోవాలంటే సత్కర్మలనాచరించాలి. సత్కర్మలే సత్ఫలితాలను అందిస్తాయి. కాని, లోపల దుర్భావాలను నింపుకొని బాహ్యంగా సత్కర్మలను ఆచరిస్తే ప్రయోజనం లేదు. లోపల నాటిన విత్తనమే మొక్కగా వస్తుందిగాని, బయట పెట్టిన విత్తనము మొలకెత్తదు కదా! అదేవిధంగా, మీరు బాహ్యంగా చేసే 'నటనలు' సరియైన ఫలితమునివ్వవు. మీ లోపల నాటుకొని పోయిన సంకల్పములు పవిత్రమైనవిగా ఉంటే వాటి ఫలితములు కూడా పవిత్రమైనవిగానే ఉంటాయి.

**దుస్సంగానికి దూరం కావాలి, సత్సంగంలో చేరాలి**

ఈ నూతన సంవత్సరములో ఎలాంటి మార్పులు సంభవిస్తాయో అని మీరు యోచిస్తూ ఉండవచ్చు. మీరు ఆచరించిన కర్మలయొక్క ప్రతిఫలమునే మీరు అనుభవిస్తారు. సత్ఫలితాలు కావాలంటే సత్కర్మలనాచరించాలి, సత్సంగములో చేరాలి. 'సత్' అనగా త్రికాలములందూ మార్పు చెందని దివ్యత్వము. కనుక, దివ్యత్వముయొక్క సాంగత్యమును అనుభవించడమే సత్సంగము. ఏదో కొద్దిసేపు ఆధ్యాత్మిక ప్రసంగాలు వినడం, భజనలు చేయడం... ఇలాంటివి సత్సంగము క్రిందికి రావు. 'భద్రం పశ్యంతు', 'భద్రం శృణ్వంతు', 'భద్రం కుర్వంతు' (మంచి చూపులు చూడాలి, మంచి మాటలు వినాలి, మంచికర్మలను ఆచరించాలి) – ఇవి మనుచక్రవర్తి మానవునికి అందించిన మూడు ప్రధానమైన మంత్రములు. ఈ మూడింటిని మీ నిత్యజీవితములో అనుభవించినప్పుడే మీకు మంచి ఫలితాలు లభిస్తాయి. మీలో ఉన్న దుర్భావములే మిమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. మీరు దుస్సంగములో చేరితే ఆ దుర్భావములు మరింతగా పెరిగిపోతాయి. కాబట్టి, మీరు మొట్టమొదట దుస్సంగమునకు దూరంగా ఉండాలి. సత్సంగములో ప్రవేశించి దానిని అభివృద్ధిపరచుకోవాలి. అప్పుడు అందరిలోను మీరు మంచినే చూస్తారు. మిమ్మల్ని ద్వేషించే వ్యక్తి మీకు ఎదురయ్యాడనుకోండి. 'ఒరేయ్ దుర్మార్గుడా! నీవు నాకు అపకారం చేస్తావా," అంటూ అతనిపై మండిపడకూడదు. 'హలో మిత్రుడా! హౌ ఆర్ యు?' అంటూ ప్రేమతో పలుకరించాలి. అప్పుడా శత్రువుకూడా మీకు మిత్రుడైపోతాడు. మీ

sri sathyasaivachanamrutam

పలుకరింపు మృదుమధురంగా ఉండాలి. మీరు ప్రేమగా పలుకరిస్తే ఎదుటి వ్యక్తికూడా ప్రేమగానే స్పందిస్తాడు. ప్రపంచములో ఉన్న క్రోధమును, ద్వేషమును చల్లార్చాలంటే మనం మృదుమధురంగా మాట్లాడాలి. మనలో ఉన్న పవిత్రమైన ప్రేమయే ఎదుటి వ్యక్తిలో ప్రేమను పెంచుతుంది. ప్రేమద్వారానే శాంతి ఏర్పడుతుంది.

'విశ్వాసమెక్కడో ప్రేమ అక్కడ. ప్రేమ ఎక్కడో శాంతి అక్కడ.
శాంతి ఎక్కడో సత్యమక్కడ. సత్యమెక్కడో దైవమక్కడ.'

కనుక, శాంతిని పొందాలంటే దైవవిశ్వాసమును పెంచుకోవాలి, ద్వేషమును నిర్మూలించుకోవాలి.

**తల్లిదండ్రులకు మొట్టమొదట కృతజ్ఞత చూపాలి**

ప్రేమస్వరూపులారా! విశ్వాసమే మీ శ్వాసగా భావించాలి. చెడ్డభావాలను హృదయంలో చేరనివ్వకూడదు. మీరు భగవంతుని ప్రేమను ఎంతగానో అనుభవిస్తున్నారు. భగవంతునినుండి సుఖసంతోషాలను అందుకొంటున్నారు. దానికి తగిన కృతజ్ఞతను చూపుతున్నారా? భగవంతుడు మీనుండి ఏదీ ఆశించడు. తాను చేసిన ఉపకారానికి ప్రతిఫలం కోరడు. మీరిచ్చే ప్రతిఫలంకోసం తానుకాచుకోడు. కాని, కృతజ్ఞత చూపడం మీ కర్తవ్యం. మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించాలి. కృతజ్ఞత లేని మానవుడు క్రూరమృగముకంటే హీనుడు. మీ అభివృద్ధికి తోడ్పడిన మీ తల్లిదండ్రులకు మొట్టమొదట కృతజ్ఞత చూపాలి. "మాతృదేవో భవ, పితృదేవో భవ." మిమ్మల్ని నవమాసాలు మోసి కని పెంచి పెద్దచేసిన మీ తల్లికి మీరేమి కృతజ్ఞత చూపుతున్నారు? ఎన్నో శ్రమలకోర్చి ధనము సంపాదించి మిమ్మల్ని పోషించి అభివృద్ధికి తెచ్చిన మీ తండ్రికి మీరేమి కృతజ్ఞత చూపుతున్నారు? మీరీనాడు తల్లిదండ్రులకు కృతజ్ఞత చూపినప్పుడే భవిష్యత్తులో మీ పిల్లలు మీకు కృతజ్ఞులై ఉంటారు. పదిమంది ఎదురుగా మంచిమాటలు మాట్లాడడం, లోపల దుర్భావాలను నింపుకోవడం... ఇది రాక్షసత్వమనే చెప్పవచ్చును. రాక్షసులకు రాత్రిపూట చాలా ధైర్యమొస్తుంది. పగటిపూట వాళ్ళకంత ధైర్యముండదు. రాత్రి అనగా అజ్ఞానాంధకారము. పగలనగా సుజ్ఞానము. కనుక, దుర్మార్గమనే చీకటిని ఆశించేవారు రాక్షసులేగాని, మానవులు కారు. వేదము, "శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాః" అని ఘోషిస్తోంది. మానవుడు అమృతపుత్రుడు.



srisathyasaivachanamrutam

దుర్లభమైన మానవజన్మను పొంది రాక్షసునివలె ప్రవర్తించడం చాలా పొరపాటు. జంతువులకైనా కృతజ్ఞత ఉన్నది. వాటికైనా ఒక నియమం ఉన్నది. కాని, ఈనాటి మానవునికి కృతజ్ఞత లేదు, ఒక నియమం లేదు.

**కలిసిమెలిసి పెరుగుదాం....**

ప్రేమస్వరూపులారా! మీరు మానవులుగా పుట్టినందుకు మానవులుగా జీవించి మీ జన్మను సార్థకం చేసుకోండి. ప్రతి మానవుడూ దైవ స్వరూపుడే! కనుక, హృదయంలో ఏమాత్రం ద్వేషాన్ని పెట్టుకోకండి. సహనభావంతో అందరితో కలిసిమెలిసి జీవించండి. దీనినే వేదము చెప్పింది:

**సహ నావవతు సహ నౌ భునక్తు**
**సహవీర్యం కరవావహై**
**తేజస్వినావధీతమస్తు మావిద్విశావహై**

దీని అంతరార్థమేమిటి?

కలిసిమెలిసి పెరుగుదాం కలిసిమెలిసి తిరుగుదాం
కలిసిమెలిసి తెలుసుకున్న తెలివిని పోషించుదాం
కలిసిమెలిసి కలతలేక చెలిమితో జీవించుదాం

వేదము అందిస్తున్న ఇట్టి పవిత్రమైన ప్రబోధలను విస్మరించి, దుష్టభావాలను పెంచుకొని, దుర్మార్గంలో ప్రవేశించి దుఃఖానికి గురి అవుతున్నాడు మానవుడు. మానవుడు నిరంతరం ఆనందంగా ఉండాలి. ఆనందమే మానవుని సహజ స్వభావము. ఇది స్వభానునామ సంవత్సరము. కనుక, ఇకనుండైనా మీరందరూ ఆనందంగా ఉండండి. ప్రేమతో కలిసిమెలిసి జీవించండి. ప్రేమలోనే మీకు నిజమైన ఆనందము లభిస్తుంది.

నిత్యానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాది లక్ష్యం
ఏకం నిత్యం విమలమచలం సర్వధీ సాక్షిభూతం
భావాతీతం త్రిగుణరహితం....

sri sathyasai vachanamrutam

ఇట్టి ఆనందము మనచెంతనే ఉండగా మనము దుఃఖానికి గురి కావడమెందుకు? దుఃఖమనేది మానవత్వానికే విరుద్ధమైనది. మీరందరూ మానవాకారంలో ఉన్న దైవస్వరూపులే! మీరు ఎవరిని ప్రేమించినా దైవాన్ని ప్రేమించినట్లే! ఎవరికి నమస్కరించినా దైవానికి నమస్కరించినట్లే! కనుక, ప్రతి వ్యక్తినీ ప్రేమించండి. ప్రతి ఒక్కరికీ నమస్కరించండి. ఎవరినైనా మీరు ద్వేషిస్తే, ఆ ద్వేషము ప్రతిబింబముగా తిరిగి వచ్చి మిమ్మల్నే హింసిస్తుంది. కనుక, ప్రేమను పెంచుకోండి. ప్రేమను అనుభవించండి. ప్రేమను జీర్ణించుకోండి. ఆ ప్రేమను పదిమందికి పంచండి. ఇదే ఈ స్వభానునామ సంవత్సరముయొక్క ప్రధానమైన సందేశము. మీరు సామాన్య మానవులు కాదు, దైవప్రతిబింబాలు! ఈ సత్యాన్ని మీరు గుర్తించి వర్తించినప్పుడు మీ తలంపులు, మాటలు, చేష్టలు అన్నీ పవిత్రంగానే ఉంటాయి. తెల్లవారి లేచినది మొదలు పరమాత్మచింతన చేయండి, పరులచింతన పెట్టుకోకండి.

**నిద్దురనుండి లేచి మరి నిద్దుర పోయెడు దాక పొట్టకై**
**హద్దునుపద్దులేక వ్యయమందగ చేయుచు జీవితంబు నీ**
**విద్దెల ధారపోసి అరవిందదళాక్షుని విస్మరించి ఏ**
**పెద్ద సుఖంబునొందితివొ ప్రీతిగ యోచన చేయు మానవా!**

కొంతమంది నిద్రనుండి లేస్తూనే కోపతాపాలను ప్రదర్శిస్తుంటారు. ఇంట్లో తల్లిదండ్రులు తిట్టుకుంటూ లేస్తే పిల్లలు కొట్టుకుంటూ లేస్తారు! తల్లిదండ్రుల భావాలే పిల్లలకు వస్తాయి. కనుక, పిల్లలకు మంచి పద్ధతులు నేర్పాలంటే మొట్టమొదట తల్లిదండ్రులు వాటిని ఆచరించి ఆదర్శాన్ని అందించాలి. ఎలాంటి పరిస్థితిలోనైనా మనం కోపతాపాలకు అవకాశమివ్వకూడదు. కొన్ని కష్టాలు వస్తుంటాయి. కాని, వాటిని లెక్కచేయకుండా ప్రశాంతచిత్తముతో ముందుకు సాగిపోవాలి.

**దేహము నీది, నీవు దేహము కాదు**

మొట్టమొదట ఏమని చెప్పాను? “అహం ఏతత్ న”, “నేనీ దేహము కాదు, నేను ఆత్మను” అని గుర్తించాలి. అప్పుడు దేహానికి సంబంధించిన బాధలు, కష్టాలు మీపై ప్రభావం చూపలేవు. దేహానికి ఎన్ని బాధలో వస్తుంటాయి. వాటిని మనం లెక్కచేయకూడదు. ఈ దేహము కష్టములనుండి పుట్టింది, కష్టములనుండి పెరిగింది. కనుక, కష్టములను

sri sathyasai vachanamrutam

అనుభవించక తప్పదు. ఇది దేహముయొక్క సహజధర్మము. ఆనందము ఆత్మ యొక్క సహజధర్మము. మనం ఆత్మధర్మమును అనుసరించాలేగాని, దేహధర్మమును అనుసరించకూడదు. దేహాత్మభావాన్ని త్యజించాలి. ఈ దేహము ఎలాంటిది?

**మలినపు కొంప రోగముల ముగ్గెడు సేవక గంప జాతసం**
**చలనము పొందు దుంప భవసాగర మీదగలేని కంప అం**
**బులపొది లెమ్ము చూడ మనమెచ్చు దలంప దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా! హరిచింతన ఆచరించవే!**

అనిత్యమైన దేహచింతన చేయడమెందుకు? నిత్య సత్యమైన దైవచింతన చేయండి. కష్టాలు వస్తాయి, పోతాయి. ఇది ప్రవృత్తి లక్షణము. కష్టసుఖాలపట్ల సమత్వం వహించడమే నివృత్తి లక్షణము. ఇది నేను కేవలం చెప్పడం మాత్రమే కాదు, చేసి చూపిస్తున్నాను కూడా. మీకు తెలుసు – దేహసంబంధమైన బాధలను నేనేమాత్రం లెక్కచేయను. ఎంత కష్టమైనా నేను నడుస్తూనే ఉంటాను, అందరినీ చూస్తూనే ఉంటాను, మాట్లాడుతూనే ఉంటాను. దేహమే నేననుకుంటే బాధలు మనల్ని క్రుంగదీస్తాయి. ఈ దేహము నీది. నీవు దేహము కాదు. 'ఇది నా కర్ఛీఫ్' అని అన్నప్పుడు కర్ఛీఫ్ నీకంటే వేరుగా ఉన్నది కదా! కనుక, కర్ఛీఫ్‌ను ఏమి చేసినప్పటికీ నీకు బాధ లేదు. అట్లే, "ఇది నా దేహము" అని అన్నప్పుడు నీవు వేరు, దేహము వేరు. కాబట్టి, దేహానికి కలిగే బాధలు దేహానివేగాని, నీవి కావు.

**దేహము పాంచభౌతికము దేహము కూలకతప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్**
**మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ యా**
**దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!**

ఆత్మయే నీ నిజస్వరూపము. కనుక, దేహానికి కలిగే బాధలకు నీవు చింతించ కూడదు. ఎవరో నిన్ను తిట్టారని బాధపడతావు. తిడితే నీకు వచ్చిన నష్టమేమిటి? గట్టిగా తిడితే గాలిలో కలిసిపోతాయి; లోలోపల తిట్టుకుంటే వాని మనస్సులోనే నిలిచిపోతాయి. ఏవీ నీకు తగలవు, ఏవీ నీదగ్గరకు రావు. అలాంటప్పుడు వానితో ఎందుకు జగడం వేసుకోవాలి? దూషణకు క్రుంగకూడదు, భూషణకు పొంగ కూడదు. సత్యమైన భావముతో నిత్యమైన

srisathyasaivachanamrutam

ఆత్మతత్త్వముపై నీ మనస్సును నిల్పినప్పుడే నీవు నిజమైన మానవునిగా రూపొందుతావు.

**నిజమైన సాధకుని లక్షణం**

ఈనాడు ఎంతో పవిత్రమైన సంవత్సరము ప్రారంభమైనది. కనుక, నీవు కూడా పవిత్రమైన భావాలను పెంచుకోవాలి. కేవలం ఈ సంవత్సరం లోనే కాదు, నీ జీవితాంతము పవిత్రమైన భావాలను పోషించుకోవాలి. దేహము పాంచభౌతిక మైనది. కాబట్టి, ఇది కొంత బాధననుభవించక తప్పదు. అనుభవిస్తుంది, పోతుంది. దీనితో నీవు సంబంధం పెట్టుకోకూడదు. ఈ సత్యసూక్తిని ఆచరణలో పెట్టడమే నీవు చేయవలసిన సాధన. ఇట్టి సాధన చేయకుండా నీవు చేతిలో జపమాల త్రిప్పుతూ సాధన చేస్తున్నానంటావు. చేతిలో జపమాల తిరుగుతూ ఉంటే మనస్సు ఊరంతా తిరుగుతూ ఉంటుంది. ఇదొక జపమా! కానే కాదు. నీవు ధ్యానం చేయాలని కళ్ళు మూసుకొని కూర్చున్నావు. దేహం నిశ్చలంగా కూర్చుంది గాని, మనస్సు మాత్రం పరిపరివిధాలుగా పరుగెత్తి పోతుండాది. అది ధ్యానమెలా అవుతుంది? మనస్సునుకూడానిశ్చలంగాపెట్టుకోవాలి. చలించని మనస్సును, భ్రమించని దృష్టిని సాధించినప్పుడే నీవు నిజమైన సాధకుడవౌతావు. చంచలత్వం కోతిలక్షణము. కాబట్టి, చంచలత్వాన్ని ఏమాత్రం దగ్గరకు రానివ్వకూడదు. మనస్సును Monkey-mind గా మార్చుకోవద్దు. నీవు Mankind (మానవజాతి)కి చెందినవాడవు. కాబట్టి, నీ హృదయంలో Kindness (దయ)ని నింపుకోవాలి. త్యాగభావమును, ప్రేమను పోషించుకోవాలి.

*('ప్రేమ ముదిత మనసే కహో...' అనే పాటను తాము పాడి భక్తులచేత పాడించిన తరువాత తమ దివ్యోపన్యాసాన్ని కొనసాగిస్తూ ఇలా అన్నారు)*

ప్రేమస్వరూపులారా! మనం నోటితో గానం చేస్తూ చేతులతో తాళం వేస్తున్నాము. శ్రుతికి తగిన స్వరముండాలి, స్వరమునకు తగిన తాళం వేయాలి. హృదయమునుండి భావము రావాలి. 'భారత' అనే పదంలో 'భ' అనగా భావం, 'ర' అనగా రాగము, 'త' అనగా తాళము. కనుక, భావరాగతాళములతోభగవంతుణ్ణిభజించేవారే భారతీయులు. చాలామంది త్యాగరాజ కీర్తనలు పాడుతూ తొడపైన తాళము వేస్తుంటారు. మన రెండు చేతులకు కలిపి

srisathyasaivachanamrutam

మొత్తం పది వ్రేళ్ళున్నాయి. (ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు) ఈ దశేంద్రియములను చేర్చి మనం తాళం వేయాలి. 'రామరామరాం... రామరామ రాం....' అని పాడే సమయంలో రెండు చేతులనూ కలిపి చక్కగా తాళం వేయాలి. కాని, కొంతమంది 'రామరామ రాం...' అని అంటారేగాని, వాళ్ళ కర్మేంద్రియాలు ఒకవైపు, జ్ఞానేంద్రియాలు మరొకవైపు పోతుంటాయి. కనుకనే, వాళ్ళ భావాలు కూడా ఎక్కడెక్కడికో పోతుంటాయి. పంజాబ్‌లో గురునానక్ మొట్టమొదట సమష్టి భజనను ప్రారంభించాడు. అందరూ కలిసి ఏక కంఠంతో భగవన్నామాన్ని గానం చేయాలి. కాని, ఇలాంటి పవిత్రమైన ఆదర్శాలను ఆధునిక మానవులు ప్రక్కకి త్రోసివేసి వాళ్ళ ఇష్టప్రకారం సంచరిస్తున్నారు. ఇది మంచిది కాదు. భగవత్ప్రీతికరమైన పనులను మనం చేయాలి. 'రమయతీతి రామః', రమింపజేసేవాడు రాముడు. ప్రేమింపజేసేవాడు రాముడు. ప్రేమించేవాడు రాముడు. రామా, కృష్ణా, గోవిందా, ... ఇలా ఎన్ని పేర్లు చెప్పుకున్నా దైవము ఒక్కడే. అదేవిధంగా, మీ అందరి పేర్లు, రూపములు వేరువేరుగా ఉన్నా మీలో ఉన్న ఆత్మతత్త్వం ఒక్కటే. ఇట్టి ఏకాత్మభావాన్ని మీరు అభివృద్ధిపరచుకొని దివ్యాత్మను దర్శించండి.

(తేదీ 02.04.2003, ఉగాది, సాయిరమేశ్ సభామండపం, బృందావనం)

sri sathyasai vachanamrutam